క్లుప్తంగా

సింగిల్ విండో అధ్యక్షుడిగా ధనచంద్రారెడ్డి



ఉత్తర్వులు అందుకుంటున్న ధనచంద్రారెడ్డి

ఐరాల: స్థానిక సింగిల్ విండో అధ్యక్షుడిగా గోవిందరెడ్డి పల్లెకు చెందిన ధనచంద్రారెడ్డి నియమితులయ్యారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం నుంచి వచ్చిన నియామక పత్రాన్ని సహకార శాఖ అధికారులు ఆయనకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్ కుమార్ సహకారంతో సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

రైల్వే క్రాసింగ్ మూసివేత

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు–సిద్ధంపల్లె (చెన్నంపల్లె) మార్గంలో రైల్వే క్రాసింగ్ గేటు మరమ్మతు పనుల కారణంగా తాత్కాలికంగా ఈ నెల 14, 15 తేదీల్లో మూసివేయనున్నట్లు రైల్వే సెక్షన్ ఆఫీసర్ మధుసూదనయ్య సోమవారం తెలిపారు. పూతలపట్టు–పాకాల (స్వామినాథన్ గ్రామం) వద్ద రైల్వేక్రాసింగ్‌గేటు మరమ్మతు పనుల కారణంగా 16, 17 తేదీల్లో తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు చెప్పారు. స్థానికులు, వాహనాదారులు మార్పును గమనించాల్సిందిగా కోరారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 36 మంది ఎంపిక



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 36 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 60 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు చేశారు. అందులో 36 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికై న వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఏఐటీయూసీ నిరసన

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్మికులతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం జీవోను విడుదల చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సోమవారం వారు నల్ల రిబ్బన్ ధరించి నిరసన తెలిపారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగరాజు, నాయకులు మణి, రమాదేవి, రఘు, లతరెడ్డి, సురేష్, జయశంకర్, సుగుణ, సుభాషిణి, చిత్ర పరదేశి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



విరుపాక్షమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న రామచంద్రనాయుడు దంపతులు

పూతలపట్టు: మండలంలోని పేటమిట్టలో శ్రీ కోదండరామస్వామి వారి విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం ఘనంగా సమస్త దేవతల విగ్రహాలను గ్రామస్తులు ఊరేగించారు. ఉదయం దేవస్థాన చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు దంపతులు గ్రామంలోని విరుపాక్షమ్మ దేవత గుడి వద్దకు వెళ్లి గణపతి పూజ, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ వంటి పూజలను ప్రారంభించారు. సాయంత్రం తీర్థ ప్రసాదాలు స్వీకరించి, పండరి భజన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సర్పంచ్ గల్లా రాధాకృష్ణ, ట్రస్ట్ సెక్రటరీ రాజశేఖర్, ట్రెజరర్ రామానాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లెలో అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా చెర్లోపల్లెలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శోభారాణి, బేబి, వలంటీర్లు పాల్గొన్నారు.

నియామకం

చిత్తూరు కార్పొరేషన్: యాదమరి ఎంపీడీఓ కార్యాలయ అటెండర్ నవీన్‌కుమార్ అనారోగ్యం కారణంగా వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. దీంతో ఆయన భార్య సుమలతను సాంఘిక భద్రత పథకంలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శిగా నియమించారు. నియామక పత్రాలను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం జెడ్పీ కార్యాలయంలో అందజేశారు.

ఉత్తమ బోధన.. ప్రత్యేక సాధన

- టెన్త్ విద్యార్థులపై టీచర్ల ఫోకస్
- ఉత్తమ ఫలితాల కోసం అదనపు తరగతులు
- మార్చి 18 నుంచి టెన్త్ పరీక్షలు



పూతలపట్టు పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

పూతలపట్టు: విద్యార్థి ఉజ్వల భవితకు పదో తరగతి తొలిమెట్టు. ఈ మెట్టు ఎక్కితే ఒక మైలు రాయి దాటినట్టే. ఈ క్రమంలో టెన్త్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని అటు ఉపాధ్యాయులు, ఉత్తమ గ్రేడ్ దక్కించుకోవాలని ఇటు విద్యార్థులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి 30 వరకు జరగనున్నాయి. బృంద చర్చలకు ప్రాధాన్యం ఇస్తూ వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ముఖ్యంగా 10 వతరగతి విద్యార్థుల విజయానికి మూల స్తంభంగా ప్రభుత్వం నిలిచింది. కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు సకల సౌకర్యాలు అందివ్వడంతో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటున్నారు. ప్రైవేటు సంస్థలతో పోల్చుకుంటే 10వతరగతి పబ్లిక్ పరీక్షల్లో పూర్తిగా 100 ఉత్తీర్ణత శాతం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులే సాధిస్తున్నారు.

పరీక్షలకు సన్నద్ధం

డిసెంబర్ నుంచే పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. గత నెల 23 నుంచి ఫార్మెటివ్–3 పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 23 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. మండలంలో 11 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 10 వతరగతి చదువుతున్న 441 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో బాలురు 274, బాలికలు 170 మంది ఉన్నారు. విద్యార్థులందరూ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. పబ్లిక్ పరీక్షల సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. ఎలక్ట్రాన్ పరికరాలు, క్రీడలు, విహారయాత్రలు వంటి వాటికి పిల్లలను దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతో ఉంది. పాఠశాలలో మాత్రమే కాకుండా ఇంటి వద్ద కూడా విద్యార్థులను చదివించాలి. అప్పుడే పరీక్షల్లో ఉత్తీర్ణత మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది.

పరీక్షల సమయంలో విద్యార్థులకు సూచనలు

- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలను పెంచుకోవాలి.
- ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అనువర్తిత నైపుణ్యం పెంపొందించుకునేలా చదవాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే విధంగా అభ్యాసం చేయాలి.
- ఫిబ్రవరి చివరి నాటికి ప్రిపరేషన్, రివిజన్ రెండింటినీ పూర్తి చేసుకోవాలి.
- తొలి పరీక్షకు వారం ముందు నుంచి పూర్తిగా ఆ పరీక్ష కోసమే సమయం కేటాయించాలి.

ప్రత్యేక తరగతులు



మండలంలోని పి.కొత్త కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాను. మార్చిలో పబ్లిక్ పరీక్షలు ఉండడంతో మా టీచర్లు డిసెంబర్ నుంచే మాకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఆ తరగతులు మాకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

– గీతిక, 10వ తరగతి, పి.కొత్తకోట

మంచి మార్కులు సాధిస్తాం



పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల వల్ల మేము పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాం. ఈ ప్రత్యేక తరగతుల వల్ల సందేహాలను అప్పటికప్పుడే టీచర్లను అడిగి సమాధానం తెలుసుకుంటున్నాం. రోజూ టెస్ట్‌లు పెట్టడంతో పబ్లిక్ పరీక్షపై ఉండే భయం తగ్గిపోతోంది. ఇప్పుడే పరీక్షల్లో ఎటువంటి ప్రశ్నలు ఇచ్చినా రాయడానికి సిద్ధంగా ఉన్నాం.

– లక్ష్మీపతి, 10వ తరగతి, పూతలపట్టు

వారిపై ఒత్తిడి లేకుండా..



పదోతరగతి విద్యార్థులకు రెండు నెలల ముందు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పరీక్షలపై ఒత్తిడి లేకుండా విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా సబ్జెక్టుల పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేస్తున్నాం. పరీక్షల సమయంలో అవలంబించాల్సిన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– రవిచంద్రారెడ్డి, గణితం, పి.కొత్తకోట

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఫార్మెటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా విద్యార్థులతో పునఃశ్చరణ చేయిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులు పురోగతి సాధించేలా మరింత సమయాన్ని కేటాయించి వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

–విశ్వనాథరెడ్డి, హెచ్ఎం, పూతలపట్టు

వరసిద్ధుని సేవలో ఎంపీ రెడ్డెప్ప



ఎంపీ రెడ్డెప్పకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప సోమవారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు మాజీ సర్పంచ్ గోపినాథ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏఎస్పీ ఆరీఫుల్లా



చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ (అడ్మిన్) ఆరీఫుల్లా సోమ వారం కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కాసేపు పలు అంశాలపై చర్చించారు.

సంక్షేమ ప్రదాత జగనన్నను ఆశీర్వదించండి



దామరగుంటలో లబ్ధిదారులకు కరపత్రం అందజేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, సునీల్ కుమార్

ఐరాల: పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్ కుమార్ కోరారు. మండలంలోని కుర్రప్పపల్లె, దామరగుంట, లింగారెడ్డి ఇండ్లు, మిట్ట ఇండ్లు, వడ్రంపల్లె, చినకాంపల్లె గ్రామాల్లో సోమవారం ఎంపీ రెడ్డెప్ప, నాయకులతో కలిసి డాక్టర్ సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వారు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించి, కరపత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వానికి రాబోవు ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. ఎన్నికల్లో వేసే ప్రతి ఓటూ ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలని సూచించారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ కుల, మత, వర్గ బేధం లేకుండా ప్రతి ఇంటికీ పథకాలు అందిస్తున్నామని అన్నారు. జగనన్న పాలనలో సంక్షేమంతోపాటు రాష్ట్రాభివృద్ధి వేగవంతమైందన్నారు. చంద్రబాబు తప్పుడు హామీలు ఇచ్చి మళ్లీ ప్రజల వద్దకు వస్తున్నారని ఎవరూ నమ్మవద్దని ప్రజలకు సూచించారు. జగనన్న పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చినట్లు గుర్తుచేశారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

గెలిచేది వైఎస్సార్‌సీపీనే

ప్రతిపక్ష పార్టీలన్నీ గుంపుగా కలిసి వచ్చినా గెలిచేది వైఎస్సార్‌సీపీనే అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో జగనన్న నాయకత్వంలోనే జనరంజక పాలన కొనసాగుతుందని చెప్పారు. మహిళల సంక్షేమంతోపాటుగా విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిన పాలనాదక్షుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. ప్రజలకు కల్లిబొల్లి మాటలు చెప్పి మళ్లీ అధికారంలోకి రావాలని కుట్రలు చేస్తున్నారని ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, మహిళ శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజా చరణ్‌రెడ్డి, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ధనచంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు నరసింహారెడ్డి, శాంతిసాగర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రఘు, ఎంపీటీసీ సభ్యులు లోకేశ్వర్‌రెడ్డి, పార్టీ నేతలు చిన్నారెడ్డి, సురేష్‌రెడ్డి, గణేష్‌ప్రసాద్‌రెడ్డి, సుధీర్, చంద్రరెడ్డి, దొరబాబు, ధనంజయ, హారూన్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సిద్ధమే



వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజాచరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని దామరగుంటలో సోమవారం ప్రారంభమైన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్ కుమార్‌ని శైలాజచరణ్‌రెడ్డి దంపతులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

వీధి కుక్కల కట్టడికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: నగరంలో వీధి కుక్కల కట్టడికి తగిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో 40 మంది గాయపడిన ఘటన బాధాకరమన్నారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం మేయర్ చాంబర్‌లో ఎంహెచ్వో లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశమై చర్చించారు. వీధి కుక్కల నియంత్రణకు తగిన ప్రణాళిక సిద్ధం చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారు మాట్లాడుతూ, నగరంలో కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వార్డుల్లో వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించనున్నట్లు వివరించారు. కుక్కల సంతతి పెరగకుండా చికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. ఇందులో చట్టపరమైన ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని అధిగమించి తగిన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. ఆదివారం నాటి ఘటనలోనూ నగరపాలక కమిషనర్, ఇతర అధికారులు వేగంగా స్పందించి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మున్ముందు ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు వివరించారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ 12వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ముత్యాలమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు మురళి గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక బృందం శ్రీమహాగణపతి పూజ, శుద్ధి పుణ్యాహ వచనం, గణపతి హోమం, సకల దేవతల హోమం, పూర్ణాహుతి, దీపారాధన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం లలిత సహస్రనామార్చన, మహామంగళ హారతి చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: మండలంలో ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలని వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆర్‌బీకే సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ మంగళవారం నుంచి ఆర్‌బీకేల పరిధిలోని గ్రామాల్లో పీఎం కిసాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కొత్తగా పీఎం కిసాన్ పథకం కింద దరఖాస్తు చేసుకొనే వారిని గుర్తించి నమోదు చేయించి ఈకేవైసీ చేయించాలని పేర్కొన్నారు. ఆర్‌బీకేల్లో రైతులకు సౌకర్యంగా అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. కౌలు రైతులకు రుణాలు ఇప్పించేందుకు రైతులకు సిబ్బంది సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డులు రానివారు సంప్రదించండి

యాదమరి: మండల పరిధిలో ఆరోగ్య శ్రీ కార్డులు రాని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే వెంటనే పంచాయతీ అధికారులను సంప్రదించాలని ఎంపీడీఓ సింగన్న కోరారు. ఆయన సోమవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ కార్డులు మండల పరిధిలో అర్హులైన వారికి పంపిణీ చేయడం పూర్తి అయిందన్నారు. అర్హులుగా ఉండి ఆరోగ్య శ్రీ కార్డు రానివారు ఎవరైనా ఉంటే వారు పంచాయతీ అధికారులను, వలంటీర్లని సంప్రదించాలని ఎంపీడీఓ కోరారు.

16న రథసప్తమి పూజలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16న రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మణికంఠేశ్వర స్వామి ఆలయంలో వెలసిన సూర్యదేవునికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు వివరించారు. ఆలయంలో కల్యాణ వేదిక వద్ద రథసప్తమి సందర్భంగా సూర్యనమస్కారాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పూజలకు భక్తులు తరలిరావాలని కోరారు.

ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నివాళి

ఐరాల: రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందిన ధనుంజయ మృతదేహానికి సోమవారం ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎంపీడీవోకు సన్మానం

పూతలపట్టు: నూతన ఎంపీడీవో ప్రసన్న కుమారిని సోమ వారం వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబు రెడ్డి సన్మానించారు. ఆయన వెంట మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు వైద్య సేవలు





ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న ప్రవీణ్‌కుమార్, తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ప్రియాంక

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలన్నాదే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలకలలో సోమవారం 104 వాహనం ద్వారా 75 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ప్రరజలు ఆరోగ్యాగ్య సూత్రాలు పాటించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లె: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పల్లెచెరువులో డాక్టర్ ప్రియాంక, గోవిందరెడ్డిపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ వైద్య శిబిరం నిర్వహించారు. గర్భవతులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని అన్నారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళాశక్తితోనే వెలుగు

- జగనన్న సంక్షేమ పథకాలతో మహిళాభ్యున్నతికి
- ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం
- ఆసరా చెక్కు పంపిణీలో విజయానందరెడ్డి పిలుపు

చిత్తూరు రూరల్: మహిళా శక్తితోనే ఇంటికి, రాష్ట్రానికి వెలుగని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు మంజూరైన వైఎస్సార్ ఆసరా 4వ విడత నిధుల చెక్కును సోమవారం చిత్తూరు మండల పరిషత్ కార్యా లయ ఆవరణలో ఆయన పంపిణీ చేసి మాట్లా డారు. మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చి మహిళాభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. వైఎస్సార్ చేయూత, ఆస రా, బ్యాంకు రుణాలు, చేదోడు, కాపు నేస్తం..సంక్షేమ ఫలాలను మహిళలకే అందజేస్తోందన్నారు. ఆ పథకాలతో మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించి కుటుంబాలకు ఆసరాగా నిలబడ్డారన్నా రు. చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణమాఫీ అంటూ అక్క చెల్లెమ్మలకు శఠగోపం పెట్టారని, ఫలితంగా మహిళలు రుణాలు చెల్లించలేక అప్పు ల ఊబిలో కూరుకుపోయారన్నారు. మహిళాభ్యున్నతి ఊసెత్త ని చంద్రబాబు ఎన్నికల సమయంలోనే కల్లబొల్లి హామీలతో ప్రజలను మభ్యపెట్టడం రివాజని విమర్శించారు. బాబు మాయమాటలకు మోసపోరాదని, జగనన్న చేసిన మే లును దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆసరా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబు నాయుడు, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఎం విజయభాస్కర్, సర్పంచులు అమర్‌నాథ్, త్యాగరాజులు, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, నాయకులు సంపత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విజయానందరెడ్డి



మహిళలకు చెక్కును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి